మద్దతుకు ముందు

మరింత బలహీనం!



సమీక్ష: దేశీయ, అంతర్జాతీయ ధోరణులు బలహీనంగా ఉండడంతో వరుసగా రెండో వారమూ మార్కెట్లలో విక్రయాల ఒత్తిడి ఎదురైంది. జపాన్ భూకంపం దరిమిలా ముడి చమురు ధరలు తగ్గడంతో మార్కెట్ సానుకూలంగానే ప్రారంభమైంది. మరో పక్క ద్రవ్యోల్బణం పెరిగినా ముందస్తు పన్ను చెల్లింపులు బావుండడంతో ఆర్‌బీఐ పరపతి సమీక్షకు ముందు కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే జపాన్ రేడియేషన్ ప్రమాదం అంతకంతకూ భయపెట్టడం, రిజర్వ్ బ్యాంకు సమీక్షలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాలను పెంచడంతో వారాంతానికి సెన్సెక్స్ 295 పాయింట్ల నష్టంతో 17879 వద్ద స్థిరపడింది.

ఎఫ్ఐఐల తీరు: విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) కాస్త తక్కువగా రూ.19 కోట్ల నికర విక్రయాలు జరిపారు. మ్యూచువల్ ఫండ్లు రూ.101 కోట్ల మేర నికర కొనుగోళ్లు జరిపాయి.

రంగాల వారీగా: జపాన్ సునామీ తదనంతర పరిణామాల్లో వాహన సరఫరాలపై అనిశ్చితి నేపథ్యంలో వాహన షేర్లు నష్టాల పాలయ్యాయి. ఎఫ్ఎమ్‌సీజీ, ఐటీ సూచీలు విక్రయాల ఒత్తిళ్లు ఎదుర్కొన్నాయి. మన్నికైన వినియోగదారు షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే కీలక రేట్లు ఉండడంతో బ్యాంకింగ్ షేర్లు దూసుకెళ్లాయి. ఈ వారంలో ముడి చమురు ధరలు దిగిరావడంతో చమురు-సహజవాయువు షేర్లు లాభపడ్డాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:5గా ఉండడం చూస్తే మార్కెట్ తక్కువ స్థాయిలకు పడిపోవడం కొనసాగితే విక్రయాల ఒత్తిడి తీవ్రతరమవుతుందని భావించాలి.

ఈ వారంపై అంచనాలు: మార్కెట్ మరో వారం కుంగింది. కీలక 17857 స్థాయికి కొద్దిగా పైన ముగిసింది. అంతక్రితం చెప్పినట్లు 17857 కంటే దిగువన ముగిస్తే మార్కెట్లో బలహీనతలు మరింత పెరుగుతాయి. కేవలం 18915 స్థాయి కంటే పైకి వెళితేనే రికవరీని చూడగలం. మధ్య కాల అధోముఖ ధోరణిలో ఉన్న ప్రస్తుత మార్కెట్ 17295 కంటే దిగువన ముగిస్తే బేర్ దశ కొనసాగవచ్చు. స్వల్పకాలానికి మార్కెట్ ఎఫ్ఐఐల పెట్టుబడులపై ఆధారపడి ఉంటుంది. ఎఫ్ఐఐల విక్రయాలు పెరిగితే మార్కెట్ కిందకు చలించవచ్చు.

ప్రభావితం చేసే అంశాలు: వికీలీక్స్ తదనంతర పరిణామాలు; పార్లమెంటరీ బడ్జెట్ సమావేశాలు, వారం వారీ ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలు, ముడి చమురు ధరల కదలికలు, జపాన్ రేడియన్ ప్రభావం; అమెరికా గృహ, ఉద్యోగ, జీడీపీ గణాంకాలు మార్కెట్‌పై ప్రభావం చూపొచ్చు.

తక్షణ నిరోధ స్థాయిలు: 18260, 18464, 18691

తక్షణ మద్దతు స్థాయిలు: 17752, 17560, 17295

మార్కెట్‌కు మద్దతు లభించే ముందు మరింత బలహీనత కనిపించవచ్చు.

–సతీశ్ కంతేటి, జెన్ మనీ